

వీసీ నియామకం జరిగేనా..?

ఈ నెల 21న కేయూ వీసీ రమేశ్ పదవీకాలం ముగుస్తుంది. కాగా మిగితా వర్సిటీలతో పాటే కేయూకు కూడా కొత్త వీసీని నియమిస్తారా..లేదా అనే చర్చ జరుగుతోంది. - 8లో▸



నలుగురు దొంగల అరెస్టు

ద్విచక్ర వాహనాలు దొంగతనం చేస్తూ పట్టుబడిన నలుగురిని అరెస్ట్ చేసి, వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పరకాల ఏసీపీ కిశోర్‌కుమార్ తెలిపారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం

35^0 / 25^0

వాతావరణం

జిల్లాలో ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. పలు చోట్ల ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



నర్సంపేట: పట్టణంలోని ద్వారకపేట వేణుగోపాల వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో ఆలయ చైర్మన్ గంధం నరేందర్‌గుప్తా ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు రెండో రోజు శుక్రవారం కొనసాగాయి. ప్రధాన అర్చకుడు ఆరుట్ల వెంకటాచార్యులు, శ్రీధరాచార్యులు పూజలు నిర్వహించి అన్నప్రసాద సన్నిధిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ, భక్తులు పాల్గొనగా ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవతో మొదలుకొని అష్టోత్తర శత 108 కలశములతో స్వామివారికి అభిషేకం, మహా త్రిమంజనం, విశిష్ట అర్చనలు నిర్వహించారు. అన్న ప్రసాద సన్నిధి దాతలు కటంగూరి ప్రేమానందరెడ్డిసుమతి, కటంగూరి దయానందరెడ్డి, మదన్మోహన్‌రెడ్డిల జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు అభిషేకలు పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ నరేందర్‌గుప్తా మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి సహకరించిన దాతలకు, విశిష్ట దాతలు, అన్నదాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బూరుగు సాంబయ్యగౌడ్, మోతె నరేందర్‌రెడ్డి, గాండ్లోజు భాస్కరాచారి, నంద్యాల సురేష్‌రెడ్డి, పావనివేణు, గోపగాని వెంకటేశ్వర్లుగౌడ్, కాసర్ల శ్రీనివాస్‌రెడ్డి, యాదుగురి జగన్, తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి ఆర్చరీలో శిక్షణ

పర్వతగిరి: మండలంలోని కల్లెడ ఆర్‌డీఎఫ్ ఆర్చరీ అకాడమీ ఆధ్వర్యంలో ఆర్చరీ వేసవి శిక్షణ శిబిరం ఈనెల 20వ తేదీ నుంచి జూన్ 5వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆర్చరీ కోచ్ రేణుమండల్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ శిక్షణలో భాగంగా షూటింగ్, బాడీ పోస్టుర్, ఫిజికల్ ఆక్టివిటీ, ఇతర విషయాల గురించి అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎ.జనార్దన్ మాట్లాడుతూ ఈ శిక్షణలో పాల్గొన్న బాల బాలికలకు ప్రత్యేక హాస్టల్ వసతి కల్పించబడుతుందన్నారు. మండలంలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పూర్తి వివరాలకు 9959301913, 9989030018 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలి



నర్సంపేట: బీజేపీ వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని వరంగల్ ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జ్, కామారెడ్డి శాసన సభ్యుడు కాటిపల్లి వెంకటరమణారెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు పట్టణంలో ముఖ్య నాయకులతో శుక్రవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయానికి ముందుండి పోరాడాలని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జ్‌లు మోహన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, వరంగల్ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు ఎడ్ల అశోక్‌రెడ్డి, నర్సంపేట నియోజకవర్గ నాయకులు డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి, పార్లమెంటు కో కన్వీనర్ కట్ల రామచందర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కంభంపాటి పుల్లారావు, ప్రధాన కార్యదర్శి రేసు శ్రీనివాస్, నియోజకవర్గ కన్వీనర్ వడ్డేపల్లి నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాశీబుగ్గ సెంటర్: బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకంలో భాగంగా 1, 5వ తరగతుల్లో షెడ్యూల్ కులాల విద్యార్థుల అడ్మిషన్లకు జూన్ 7వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ అధికారి భాగ్యలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 1వ తరగతికి 60, 5వ తరగతికి 62 సీట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. కుటుంబంలో ఒక విద్యార్థికి మాత్రమే ఈ పథకానికి అర్హులని, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50లక్షలు, పట్టణ ప్రాంతంలో రూ.2లక్షలకు మించరాదన్నారు. దరఖాస్తు పత్రంతో పాటు పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు, ఆధార్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఫొటోలు(3) గత సంవత్సరం మార్కుల జాబితా జిరాక్స్ కాపీలతో గెజిటెడ్ అధికారి సంతకంతో సమర్పించాలన్నారు. ఆసక్తి గల విద్యార్థులు సహాయ సాంఘిక సంక్షేమ అధికారి కార్యాలయం వరంగల్, నర్సంపేటలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. పూర్తి వివరాలకు 9346374583, 9550078045, 9701198330 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

అకాల వర్షం.. రైతుకు తీరని నష్టం

- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- టార్పాలిన్లు కప్పినా అదే పరిస్థితి
- మొక్కజొన్న రైతుల పరిస్థితి దయనీయం
- జిల్లాలో ముందుకు సాగని కొనుగోళ్లు
- ఇప్పటివరకు 38,820 మెట్రిక్ టన్నులు మాత్రమే సేకరణ



సంగెం: వెంకటాపూర్‌లో నేలవాలిన వరి పంట

సాక్షి, వరంగల్: ఎండాకాలంలో ఈ వర్షాలేమిటో నంటూ అన్నదాతలు చేతికొచ్చిన పంటలవైపు చూస్తూ దిగాలు చెందుతున్నారు. గురువారం రాత్రి నుంచి శుక్రవారం వరకు జిల్లాలోని పలు మండలాల్లో కురిసిన వర్షాలతో రోడ్లపై కుప్పలుగా పోసిన వరి ధాన్యం, మొక్కజొన్న తడిసిన పరిస్థితి కనిపించింది. కొన్ని చోట్ల పంట కుప్పలపై టార్పాలిన్లు కప్పినప్పటికీ కింది నుంచి వరద పారడంతో తడిసి ముద్దయ్యాయి. కొద్దిరోజులుగా పంటలతో తేమ తగ్గడం లేదని రైతులు వాపోతున్నారు. ఆరబెడితే వర్షాల ముప్పు, కుప్ప ఉంచితే తేమ శాతంతో తిప్పలుగా ఉందని చెబుతున్నారు. పంట చేతికొచ్చే సమయానికి అకాల వర్షాలు రైతన్నను ఆగమాగం చేస్తుండడంతో ఆందోళనలో ఉన్నారు. శుక్రవారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు రాష్ట్రంలో ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో పంటలు కాపాడుకునేందుకు రైతులు చర్యలు తీసుకుంటున్నా.. ఇబ్బందులు తప్పడం లేదు. సోమవారం వరకు ఇదే పరిస్థితి ఉండే అవకాశం ఉండడంతో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. లోక్ సభ ఎన్నికలతో వరి ధాన్యం కొనుగోలులో అధికారుల ఆలసత్వమే ఇప్పుడు అన్నదాతల గోసకు అద్దం పడుతుందన్న విమర్శలు ప్రతిపక్ష పార్టీల నుంచి వినవస్తోంది.

ఇప్పటివరకు 38,820 మెట్రిక్ టన్నులే..

జిల్లా వ్యాప్తంగా 206 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. ఈ ఏడాది వరి సాగు రెట్టింపుకావడంతో 1,50,000 మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని వ్యవసాయ శాఖ గణాంకాలను బేరీజు వేసుకొని పౌర సరఫరా అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఈ కేంద్రాలు ప్రారంభమై నెలన్నర రోజులవుతున్నా ఇప్పటివరకు 38,820 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు. వీటిలో 38,820 టన్నులను లారీల ద్వారా మిల్లులకు రవాణా చేశారు. తేమశాతం సరిగా లేదన్న సాకుతో రోజుల తరబడి వేచి ఉంచడంతో ఇప్పుడూ ఆకస్మాత్తుగా వచ్చిన వర్షాలతో మళ్లీ తేమశాతం రావాలంటే మరో పదిరోజులు ఆరబోస్తే గానీ కొనే పరిస్థితి కనిపించడం లేదని వాపోతున్నారు. ప్రభుత్వమే దృష్టి సారించి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే వందల ఎకరాల్లో సాగుచేసినా మొక్కజొన్న రైతుల పరిస్థితి కూడా దయనీయంగా మారడంతో ఆవేదన చెందుతున్నారు.



సంగెంలో నేల రాలిన మామిడికాయలు

ఎంత వర్షం కురిసిందంటే

జిల్లాలో గురువారం నుంచి శుక్రవారం ఉదయం వరకు అన్ని మండలాల్లో వర్షం కురిసింది. అత్యధికంగా గీసుకొండ మండలం గొర్రెకుంటలో 94.5 మిల్లీమీటర్ల వర్షపాతం, అత్యల్పంగా నర్సంపేట మండలం లక్నేపల్లిలో 8.5 మిమీల వర్షపాతం నమోదైంది. వర్ధన్నపేటలో 85.5, వరంగల్ కాశీబుగ్గలో 76.3, రాయపర్తిలో 73.6, ఖిలావరంగల్‌లో 59.8, వరంగల్ పైడిపల్లిలో 54.5, సంగెంలో 49.5, పర్వతగిరిలో 43.5, దుగ్గొండిలో 39.3, చెన్నారావుపేటలో 38.5, నల్లబెల్లిలో 36, నెక్కొండలో 33.8, ఖానాపురంలో 23.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయిందని అధికారులు తెలిపారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి..



రెండెకరాల్లో మొక్కజొన్న పంట పండించాం. కోసిన కంకులు చేను వద్ద ఆరపోశాం. తేమ శాతం రావడం లేదని జాతీయ రహదారిపై ఆరపోశాం. గురువారం రాత్రి కురిసిన వర్షానికి తడిచి పోయింది. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలి.

- ఎర్ర రమ, మహిళా రైతు, నల్లబెల్లి

మిల్లర్ల తిరకాసు



కాంటాలు వేసి సిద్ధంగా ఉన్న ధాన్యం బస్తాలు

ఆరుగాలం కష్టపడి పంటలు సాగు చేస్తున్న రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైంది. కష్టపడి సాగు చేసిన పంట తీరా కోత దశకు చేరే సమయంలో అకాల వర్షాలు అన్నదాతల పాలిట శాపాలుగా మారుతున్నాయి. అష్టకష్టాలు పడి ధాన్యం బస్తాల్లో నింపిన తర్వాత అకాల వర్షం పడి బస్తా అడుగు భాగాల్లో తడిస్తే మిల్లర్లు తీసుకెళ్లడం లేదు. తడిసిన ధాన్యాన్ని అధికారులు రిజెక్ట్ చేస్తుండటంతో లారీల్లో లోడ్ చేసుకోవడానికి ముందుకు రావడం లేదు. ఖానాపురం మండలం ఐనపల్లి శివారులో ధాన్యం నింపిన బస్తాలను లారీలో లోడ్ చేసుకోలేదు. దీంతో కాసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. అయినా ధాన్యం తీసుకెళ్లకపోవడంతో రైతులు కన్నీరు పెట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

కాంటా నిలిపేశారు..



పది ఎకరాల పొలంలో వరి పంట పండించాం. కొద్ది రోజుల క్రితం పంట కోసి ధాన్యాన్ని ఆరబెట్టినం. 400 బస్తాల్లో 150 బస్తాలు మాత్రమే కాంటా అయ్యాయి. ఇంకా 250 బస్తాలు కాంటా చేయాల్సి ఉంది. అయితే అకాల వర్షాలతో కాంటా నిలిపేశారు. గ్రామంలో ఊరి పండుగ ఉండటంతో హమాలీ వారు రావడం లేదు. వర్షాలు పడుతుండటంతో భయం వేస్తుంది. ప్రభుత్వం తడిసిన ధాన్యం కూడా కొనుగోలు చేయాలి.

-బానోతు సమ్మయ్య, రైతు, తిమ్మరాయినిపహాడ్

భద్రకాళి ఆలయంలో డోలోత్సవం

- భద్రపీఠం, ఆశ్వవాహనంపై ఊరేగింపు



భద్రకాళి అమ్మవారు

హన్మకొండ కల్చరల్ : భద్రకాళి దేవాలయంలో జరుగుతున్న భద్రకాళీభద్రేశ్వరుల కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం నిత్యాహ్నికం, చతుస్థానార్చన నిర్వహించి పాలభోగం, క్షీరాన్న నివేదన జరిపారు. అమ్మవారి మూలమూర్తిని పూమాలలతో శోభాయమానంగా అలంకరించారు. ప్రధానార్చకుడు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో వేదపండితులు అమ్మవారికి డోలోత్సవం నిర్వహించారు. అనంతరం అమ్మవారిని భద్రపీఠం, సాయంత్రం అశ్వవాహనంపై ఊరేగించారు. పూజా కార్యక్రమాలకు వరంగల్ కమ్మసేవా సంఘం బాధ్యులు ఉభయదాతలుగా వ్యవహరించారు. కమ్మసేవా సంఘం అధ్యక్షుడు మందటి కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి గంగవరపు రామకృష్ణప్రసాద్, కూనాటి హరిబాబు, ధనేకుల రాంబాబు పాల్గొన్నారు. వరంగల్ దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత అమ్మవారిని దర్శించుకున్నారు.

పీవీ నాలెడ్జ్ సెంటర్ డైరెక్టర్‌గా కృష్ణయ్య



ఉత్తర్వులు అందజేస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి

కేయూ క్యాంపస్ : కేయూలోని పీవీ నాలెడ్జ్ సెంటర్ డైరెక్టర్‌గా పొలిటికల్ సైన్స్ విభాగం కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ గడ్డం కృష్ణయ్యను నియమిస్తూ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు కృష్ణయ్య బాధ్యతలు స్వీకరించారు. కుటా అధ్యక్షుడు శ్రీధర్‌కుమార్‌లోథ్, బాధ్యులు టి.నాగయ్య, సంకినేని వెంకన్న, కరుణాకర్‌రావు, మధుకర్‌రావు, చీకటి శ్రీనివాస్, సత్యనారాయణ, తదితరులు కృష్ణయ్యను అభినందించారు.

మౌలిక వసతులు త్వరగా కల్పించాలి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ సంధ్యారాణి

కాశీబుగ్గ సెంటర్: పాఠశాలల పునఃప్రారంభానికి ముందే అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా చేపట్టిన కనీస మౌలిక వసతుల కల్పన పూర్తి చేయాలని సీఎస్ శాంతకుమారి అన్నారు. శుక్రవారం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పనులు, ధరణి దరఖాస్తులు, ధాన్యం కొనుగోలు తదితర అంశాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎస్ శాంతకుమారి సమీక్ష చేశారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారమే లక్ష్యంగా కలెక్టర్లు రెగ్యులర్‌గా తహసీల్దార్లతో సమావేశం నిర్వహించి మే చివరి నాటికి పూర్తి స్థాయిలో పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమం పునఃప్రారంభానికి ముందే పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 34లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని వేలం వేశామని, వీటిని తర్వగా కొనుగోలుదారులకు అప్పగించాలని, గోడౌన్ల నుంచి తర్వగా ధాన్యం తరలింపు పూర్తి కావాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ మండల సమాఖ్యలచే ఏకరూప దుస్తులు తయారీ చేయించి జూన్ 10లోగా విద్యార్థులకు అందించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. నాణ్యమైన ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌ఓ శ్రీనివాస్, డీఆర్‌డీఓ పీడీ కౌసల్యాదేవి, డీఎస్‌ఓ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు ఆశీస్సులు ఉండాలి

- ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

చెన్నారావుపేట: ఏసుక్రీస్తు ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. ఈ మేరకు మండలంలోని తిమ్మరాయిని పహాడ్ గ్రామంలో శుక్రవారం జరిగిన గ్రామ ఆవిర్భావ జూబ్లీ ముగింపు వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామం ఆవిర్భావించి 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా గ్రామ ప్రజలకు, గురువులకు శుభాకాంక్షలు తెలిపారు. 40 సంవత్సరాలుగా నాకు వెన్నంటి ఉంటూ గ్రామ ప్రజలు సహకరిస్తున్నారన్నారు. చర్చి ఆవరణలో ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి రూ. 7 లక్షలతో సీసీ ప్లాట్ ఫామ్ పనులు చేయించినట్లు తెలిపారు. గ్రామ అభివృద్ధికి సహకరిస్తానని హామీ ఇచ్చారు. విచారణ గురువు యాగారెడ్డి, గుడి పెద్దలు ఎమ్మెల్యే మాధవరెడ్డిని సన్మానించారు. అనంతరం గ్రామంలో అనిల్ కుమార్ అనే ఉపాధ్యాయుడు తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా, మండల, గ్రామ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఆదాయ వనరులపై దృష్టి సారించాలి

- డీపీఎం భవాని



కుట్టు మిషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఎం

వర్ధన్నపేట: మహిళలు ఆదాయ వనరులపై దృష్టి సారించి ఆదాయ అభివృద్ధితో పాటు ఆర్థిక ప్రగతి సాధించాలని డీఆర్‌డీఏ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ (డీపీఎం) భవాని అన్నారు. శుక్రవారం మండలంలోని ఇల్లందలో గ్రామైక్య సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫామ్స్ కుట్టు మిషన్ సెంటర్‌లను సందర్శించి ప్రారంభించారు. అదే విధంగా మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన సెంటర్‌ను ఏపీఎం వేణు ప్రారంభించారు. ఇల్లందలోని గంగా గ్రామైక్య సంఘం నెలసరి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భవాని మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి ఆర్థికంగా సామాజికంగా ఎదగాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి మహిళా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం వేణు, సీసీలు గోలి కొమురయ్య, టి.రమేష్, స్వామి, పంచాయతీ కార్యదర్శి రామారావు, గంగా గ్రామైక్య సంఘం ప్రతినిధులు భాను, బొంతల మౌనిక, కవిత, ఎల్లమ్మ, సఫియా, వీఓఏలు కారోబార్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

గులాబీ కోటలో పట్టభద్రుడెవరో?

- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికకు తొమ్మిది రోజులే సమయం
- ఇంకా ఊపందుకోని ప్రచారం...
- ప్రధాన పార్టీల గెలుపు ధీమా... అతి నమ్మకంలో అభ్యర్థులు
- అంటీముట్టనట్లుగా మూడు పార్టీల ముఖ్యనేతలు
- ఈ నెల 27న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక..



ప్రేమేందర్‌రెడ్డి



రాకేశ్‌రెడ్డి



తీన్మార్ మల్లన్న

సాక్షిప్రతినిధి, వరంగల్: వరంగల్, నల్లగొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం ఉపఎన్నికల పోలింగ్‌కు మరో తొమ్మిది రోజులే సమయం ఉంది. ఈ స్థానం నుంచి ఎమ్మెల్సీగా ఉన్న బీఆర్‌ఎస్ నేత పల్లా రాజేశ్వర్ రెడ్డి జనగామ ఎమ్మెల్యేగా ఎన్నికై రాజీనామా చేయడంతో ఉప ఎన్నిక జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ ఎన్నికల ప్రచారం ఇప్పటికే రసవత్తరంగా మారాల్సి ఉంది. ఈ నెల 13 వరకు లోక్‌సభ ఎన్నికల హడావుడి ఉండటంతో ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు అంతగా పట్టించుకోలేదు. పార్లమెంట్ ఎన్నికల ఘట్టం ముగిసి ఆరు రోజులు గడిచినా.. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీల ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలు ఇంకా అంటీముట్టనట్లే ఉంటున్నారు. పట్టభద్రులను కలిసే ప్రయత్నం చేయకపోగా.. ఓటర్ల జాబితా, ఫోన్ నంబర్లను సేకరించి మెస్సేజ్‌ల పంపడానికే పరిమితమవుతున్నారు. ఈ నెల 27న పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం ఉప ఎన్నికల పోలింగ్ జరగనుండగా.. ఒక్కరోజు ముందే ప్రచారాన్ని ముగించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ప్రచారం ఇంకా పట్టభద్రులను తాకకపోవడంపై ఓటర్లలో చర్చ జరుగుతోంది.

పట్టభద్రులు పట్టం కట్టేది ఎవరికో...

నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గం ఓటర్లు ఎవరికి పట్టం కట్టనున్నారనేది ఆసక్తికరంగా మారింది. ఈ ఉప ఎన్నికలో మొత్తం 52మంది పోటీ చేస్తుండగా.. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ అభ్యర్థుల మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. కానీ, ప్రధాన పార్టీల ముఖ్యనేతలు కొందరు మాత్రం ఇంకా లోక్‌సభ ఎన్నికల మూడ్ నుంచి బయట పడలేదన్న చర్చ జరుగుతోంది. కాగా ఈ స్థానంపై కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక దృష్టి పెట్టింది. 2007లో ఈ నియోజకవర్గం ఏర్పడగా, అప్పటి నుంచి జరిగిన మూడు ఎన్నికల్లోనూ బీఆర్‌ఎస్ అభ్యర్థులే గెలుపొందారు. పదేళ్ల తర్వాత రాష్ట్రంలో అధికారం దక్కించుకున్న కాంగ్రెస్.. ఎమ్మెల్సీ స్థానాన్ని తన ఖాతాలో వేసుకోవాలని చూస్తోంది. 2021 ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన స్వల్ప మెజార్టీతో ఓటమి చెందిన తీన్మార్ మల్లన్న (చింతపండు నవీన్)ను పార్టీ అభ్యర్థిగా బరిలో దింపింది. నోటిఫికేషన్ వెలువడిన మరుసటి రోజు నుంచే ఆయన సుడిగాలి పర్యటన చేస్తున్నారు. బీఆర్‌ఎస్ పార్టీ నాయకత్వం తన స్థానాన్ని పదిలపర్చుకునేందుకు పావులు కదుపుతోంది. ఉమ్మడి వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల నుంచి పలువురు సీనియర్లు టికెట్ ఆశించినా.. అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీజేపీ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిన ఏనుగుల రాకేశ్‌రెడ్డికి అవకాశం కల్పించారు. ఈయన అభ్యర్థిత్వంపై బీఆర్‌ఎస్ టికెట్ ఆశించిన, మద్దతు పలికిన నేతలు ఇంకా అసంతృప్తి వీడలేదు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డికే ఆ పార్టీ అధిష్టానం మళ్లీ అవకాశం కల్పించింది. గత ఎన్నికల్లో భారీ తేడాతో ఓటమి చెందిన ప్రేమేందర్ రెడ్డి.. ఈసారి ఎలాగైనా విజయ తీరాలకు చేరాలని భావిస్తున్నారు.

ఉమ్మడి వరంగల్ ఓటర్లే కీలకం...

ఈ ఉప ఎన్నికలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఓటర్లు కీలకం కానున్నారు. 2021లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ అభ్యర్థులు కేయూ, ఉమ్మడి వరంగల్ పట్టభద్రులు కేంద్రంగా ప్రచారం నిర్వహించారు. 2021 ఎన్నికల్లో గెలుపొందిన పల్లా రాజేశ్వర్‌రెడ్డికి 1,61,811 ఓట్లు రాగా, ఆ తర్వాత స్థానంలో ఇండిపెండెంట్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న 1,49,005 ఓట్లు సాధించారు. టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్‌కు 71,126 ఓట్లు రాగా, గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి (బీజేపీ) 39,306, రాములు నాయక్ (కాంగ్రెస్) 27,729 ఓట్లతో సరిపెట్టుకున్నారు. రెండో ప్రాధాన్యం ఓట్లతో పల్లా రాజేశ్వర్ రెడ్డి గెలుపొందగా.. ఆ పోలింగ్‌లో ఉమ్మడి వరంగల్ ఓటర్లు అత్యధికంగా ఓటుహక్కును వినియోగించుకున్నట్లు తేలింది. కాగా ఎన్నికల అధికారుల ప్రకటన మేరకు 12 జిల్లాల్లో మొత్తం 4,61,786 మంది ఓటర్లు ఉండగా.. పురుషులు 2,86,993, మహిళలు 1,74,788, థర్డ్‌జెండర్స్ ఐదుగురు ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. మొత్తం ఓట్లలో అత్యధికంగా 1,67,849 మంది ఉమ్మడి వరంగల్‌లో ఉండగా.. ఈ ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో కూడా ఇక్కడి ఓటర్లే కీలకం కానున్నారన్న చర్చ జరుగుతోంది.

హేమాచలక్షేత్రం ముస్తాబు

మంగపేట: ములుగు జిల్లాలో రెండో యాదగిరి గుట్టగా ప్రసిద్ధి గాంచిన మంగపేట మండలం మల్లూరు గుట్టపైగల శ్రీ హేమాచల లక్ష్మీనర్సింహ స్వామి క్షేత్రం బ్రహ్మోత్సవాల(జాతర)కు ముస్తాబైంది. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ ప్రధానార్చకులు(వేద పండితులు) అమరవాది మురళీకృష్ణమాచార్యుల బృందం బ్రహ్మోత్సవ కార్యక్రమాలను ఆగమ శాస్త్ర ప్రకారం శాస్త్రోక్తంగా జరిపించనున్నారు. రేపటి(19వ తేదీ) నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానుండగా పది రోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు సర్వం సిద్ధం చేశారు. జాతరకు లక్షల సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఉండేందుకు అన్నిరకాల ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఇన్‌చార్జ్ కార్యనిర్వహణ అధికారి శనిగల సురేష్ శుక్రవారం తెలిపారు.

అక్రమ కట్టడం కూల్చివేత



మండల కేంద్రంలో అక్రమ కట్టడాన్ని తొలగించిన జీపీ సిబ్బంది

దుగ్గొండి: అనుమతులు లేకుండా నిర్మిస్తున్న అక్రమ కట్టడాన్ని గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో కూల్చి వేసిన సంఘటన మండల కేంద్రంలో శుక్రవారం జరిగింది. కందికొండ శ్రావణ్ గ్రామ పంచాయతీ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా అక్రమంగా ప్రహరీ నిర్మించారని పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ శుక్రవారం తెల్లవారుజామున జేసీబీ సాయంతో ప్రహరీని కూల్చివేశారు. అయితే తన భూమిలో తాను నిర్మాణం చేసుకుంటే కూల్చివేయడం ఏమిటని, పూర్తి ఆధారాలతో తాను అనుమతి కోసం జీపీకి దరఖాస్తు చేశానని తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కూల్చి వేశారని శ్రావణ్ ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు జరిగిన అన్యాయంపై డీపీఓ, ఎంపీఓలపై కమీషనర్‌కు పిర్యాదు చేస్తానని అన్నాడు. ఇదే విషయంపై ఎంపీఓ శ్రీధర్‌గౌడ్‌ను వివరణ కోరగా గ్రామ పంచాయతీ పక్కనే ఉన్న స్థలంలో చేసే నిర్మాణం అక్రమం అని జిల్లా పంచాయతీ అధికారి రిపోర్టు ఇచ్చారన్నారు. కూల్చి వేయాలని ఆదేశాలు వచ్చాయన్నారు. అయితే రాత్రి పూట కూల్చిన విషయం తన దృష్టికి రాలేదని ఆయన వివరణ ఇచ్చారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

టేకుమట్ల: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని బూర్నపల్లి శివారు ఇటుక బట్టీల వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన మలయదరువా(19) బతుకు దెరువు కోసం ఫిబ్రవరిలో బూర్నపల్లి శివారులోని ఇటుక బట్టీలలో పనికి చేరాడు. ఈక్రమంలో శుక్రవారం మధ్యాహ్నం వర్షం కురుస్తున్న సమయంలో సెల్ ఫోన్ చార్జింగ్ పెడుతుండగా విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బాబాయ్ పద్మన్ దరువా ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని చిట్యాల మార్చురీకి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

వడదెబ్బతో వ్యక్తి ..


వీరయ్య (ఫైల్)

భూపాలపల్లి రూరల్: వడదెబ్బతో వ్యక్తి మృతిచెందిన ఘటన భూపాలపల్లి పట్టణకేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓరుగంటి వీరయ్య(55) గురువారం వృత్తిలో భాగంగా లక్ష్మీనగర్‌లో ఇస్త్రీ చేస్తుండగా.. అస్వస్థతకు గురయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు భూపాలపల్లి ఆస్పత్రిలో చేర్పించగా.. చికిత్స పొందుతూ వీరయ్య గురువారం రాత్రి మృతి చెందాడు. వీరయ్యకు భార్య వణమ్మ ,ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరన్న కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని రజక సంఘం పట్టణ అధ్యక్షుడు వైనల శోభన్, నాయకులు ఓరుగంటి లక్ష్మి, రాములు, వీరస్వామి, రాజయ్య, రాజు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

రైలునుంచి జారిపడి యువకుడు..


వాంకుడోతు విక్రమ్ (ఫైల్)

గూడూరు: మానుకోట జిల్లా గూడూరు శివారు కలకత్త తండాకు చెందిన వాంకుడోతు దేవేందర్, నీలా దంపతుల కుమారుడు వాంకుడోతు విక్రమ్ (18) ఖమ్మం జిల్లా కేంద్రంలో ఇంటర్ పూర్తి చేశాడు. గురువారం వరంగల్‌కు వచ్చిన విక్రమ్.. రాత్రి సమయంలో రైలులో ఖమ్మం బయల్దేరాడు. ఈక్రమంలో విక్రమ్ నిద్రమత్తులో ఉండగా.. ట్రెయిన్ ఖమ్మం దాటి మధిర చేరుకుంది.. గుర్తించిన విక్రమ్ ట్రెయిన్ నెమ్మది వెళ్తుండగా.. దిగేందుకు ప్రయత్నించి ప్రమాదవశాత్తు జారి రైలు కిందపడగా అక్కడికక్కడే మృతిచెందినట్లు సమాచారం. శుక్రవారం విక్రమ్ మృతిచెందినట్లు రైల్వే పోలీసుల ద్వారా సమాచారం అందుకున్న తల్లిదండ్రులు, బంధువుల రోదనతో తండాలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

కాజీపేట జంక్షన్ జలమయం

- ప్లాట్‌ఫాంలోకి చేరిన వర్షపు నీరు

కాజీపేట రూరల్: గురువారం రాత్రి కురిసిన వర్షానికి కాజీపేట జంక్షన్ జలమయమైంది. రైల్వే స్టేషన్ ముందున్న సర్క్యులేటింగ్ ఏరియా నుంచి పెద్ద ఎత్తున వర్షం నీరు కాజీపేట రైల్వే స్టేషన్‌లోకి ప్రవేశించింది. దీంతో టిక్కెట్ బుకింగ్ కౌంటర్లు, రైల్వే స్టేషన్ మెయిన్ ఎంట్రెన్స్‌తోపాటు ప్లాట్‌ఫాంలోకి వర్షం నీరు చేరడంతో రైలు పట్టాల వరకు జలమయమైంది. రైల్వే స్టేషన్‌లోకి వర్షం నీరు చేరడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శుక్రవారం తెల్లవారుజాము వరకు రైల్వే సిబ్బంది వర్షం నీటిని బయటికి పంపించారు. కాగా, ఉత్తర దక్షిణ దేశ ప్రాంతాలకు గేట్‌వేగా ఉంటున్న కాజీపేట జంక్షన్‌లో వర్షం పడినప్పుడల్లా ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. వర్షం నీరు వెంటనే బయటికి వెళ్లేందుకు రైల్వే అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వీసీ నియామకం జరిగేనా..?

ఈనెల 21తో ముగియనున్న కేయూ వీసీ రమేశ్ పదవీకాలం

- సెర్చ్‌కమిటీ ఏర్పాటుచేయని ప్రభుత్వం
- పాలకమండలి నియమించాకే సెర్చ్ కమిటీకి అవకాశం!
- ఆశావహుల ప్రయత్నాలు



కేయూ క్యాంపస్: రాష్ట్రంలో పది యూనివర్సిటీలకు త్వరలో వీసీలను నియమిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల ప్రకటించిన విషయం విదితమే. యూనివర్సిటీల్లో నూతన వీసీల నియామకానికి ఎలక్షన్ కమిషన్ నుంచి కూడా అనుమతి లభించింది. దీంతో ప్రభుత్వం వీసీల నియామకానికి ఉపక్రమించబోతుంది. ఈక్రమంలో 8యూనివర్సిటీలకు సెర్చ్ కమిటీలను కూడా ఇప్పటికే ఏర్పాటు చేసింది. కానీ, కాకతీయ యూనివర్సిటీకి సెర్చ్‌కమిటీని ఏర్పాటు చేయలేదని సమాచారం. కేయూ వీసీ ఆచార్య తాటికొండ రమేశ్ పదవీకాలం ఈనెల 21న ముగియనుంది. ఈనేపథ్యంలో మిగితా యూనివర్సిటీలతోపాటే కేయూకు కొత్త వీసీని నియమిస్తారని అంతాభావించారు. కానీ, సెర్చ్‌కమిటీ ఏర్పాటు కాకపోవటంతో ఇప్పట్లో కేయూకు కొత్త వీసీ నియామకం జరగకపోవచ్చనే అనుమానం కలుగుతోంది.

పాలకమండలి లేకపోవటమే కారణమా..?

కేయూకు గత సంవత్సరం అక్టోబర్‌లో పూర్తిస్థాయి పాలకమండలి సభ్యుల పదవీ కాలం ముగిసి, ఎక్స్ అఫిషియో సభ్యులు మాత్రమే కొనసాగుతున్నారు. యూనివర్సిటీ పాలకమండలి సమావేశాన్ని ఈఏడాది ఫిబ్రవరిలో హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈసమావేశంలో కేయూ వీసీ నియామకానికి సెర్చ్ కమిటీకి యూనివర్సిటీ నామి నీని సూచించారు. అయినప్పటికీ పూర్తిస్థాయి పాలకమండలి లేకపోవడం వల్లనే సెర్చ్‌కమిటీ నియామకం చేపట్టలేదనే చర్చజరుగుతుంది. పాలకమండలి ఏర్పాటయ్యాకే ఈ విషయంలో ముందుకెళ్లనున్నట్లు తెలుస్తుంది.

వీసీల నియామకానికి దరఖాస్తుల స్వీకరణ

రాష్ట్రంలోని 10 యూనివర్సిటీలకు వీసీల నియామకానికి ప్రభుత్వం ఈఏడాది జనవరిలోనే నోటిఫికేషన్ ఇచ్చి, దరఖాస్తులు స్వీకరించిన విషయం విదితమే. పది సంవత్సరాలపాటు ప్రొఫెసర్లుగా అనుభవం కలిగినవారు దరఖాస్తులు చేసుకున్నారు. వివిధ యూనివర్సిటీల నుంచి 149 దరఖాస్తులు వచ్చాయని సమాచారం. 312మంది (ప్రస్తుతం పనిచేస్తున్న, రిటైర్డ్ ప్రొఫెసర్లు కలిపి) నుంచి 1,382 దరఖాస్తులు అందాయి. ఒక ప్రొఫెసర్ రెండు నుంచి నాలుగైదు యూనివర్సిటీలకు కూడా దరఖాస్తులు చేసుకోవడం గమనార్హం. మార్చిలోనే ఆయా దరఖాస్తుల స్క్రూటిని పూర్తయినప్పటికీ పార్లమెంట్ ఎన్నికలతో నియామక ప్రక్రియకు బ్రేక్ పడింది.

సెర్చ్‌కమిటీలో ముగ్గురు

వీసీల నియామక ప్రక్రియ చేపట్టేందుకు వివిధ యూనివర్సిటీలకు సెర్చ్ కమిటీలను నియమించారు. ఒక్కో సెర్చ్‌కమిటీలో ముగ్గురు సభ్యులు.. యూజీసీ నామిని, యూనివర్సిటీ నామిని, ప్రభుత్వ నామిని ఉంటారు. దరఖాస్తుల నుంచి యూనివర్సిటీలవారీగా సెర్చ్ కమిటీ ముగ్గురి పేర్లను గవర్నర్‌కు ప్రతిపాదిస్తుంది. ప్రభుత్వ సూచనమేరకు ఆ ముగ్గురిలో ఒకరిని గవర్నర్ వీసీగా నియమిస్తారు. ప్రస్తుతం ఏర్పాట్లు చేసిన సెర్చ్‌కమిటీల్లో ప్రభుత్వనామినీగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉన్నారు. కాగా, కాకతీయ యూనివర్సిటీకి సెర్చ్‌కమిటీని ఏర్పాటు చేయలేదు. దీంతో కేయూ వీసీ నియామకంపై సందిగ్ధం నెలకొంది.

నియామకాలు పారదర్శకంగా జరిగేనా..?

బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నియమించిన పలు యూనివర్సిటీల వీసీలపై అనేక ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. సమర్థులైనవారిని వీసీలుగా నియమించలేదని ప్రతిపక్షాలు ఆరోపణలు చేశాయి. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉండగా.. వీసీల పాలనపై ప్రశ్నించిన సందర్భాలున్నాయి. ప్రస్తుతం వీసీల నియామకాలు పారదర్శకంగా చేపట్టి, సమర్థులైన వారికి పాలన బాధ్యతలు అప్పగిస్తారని ఆశిద్దాం.

ఆశావహుల దరఖాస్తులు..

కేయూ వీసీ పదవి కోసం దరఖాస్తులు చేసిన వారిలో ప్రస్తుత వీసీ ఆచార్య తాటికొండ రమేశ్‌తోపాటుగా కేయూ మాజీ వీసీ ఆచార్య వెంకటరత్నం, శాతవాహన యూనివర్సిటీ మాజీ వీసీ కేయూ రిటైర్డ్ ఆచార్యులు ఎండీ ఇక్బాల్ అలీ, మహాత్మాగాంధీ యూనివర్సిటీ మాజీ వీసీ, కేయూ రిటైర్డ్ ఆచార్యులు అల్తాఫ్ హుస్సేన్ కూడా ఉన్నారు. కేయూ ప్రస్తుత రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి, మాజీ రిజిస్ట్రార్లు సదానందం, సాయిలు, పురుషోత్తం కూడా పోటీలో ఉన్నారు. అదేవిధంగా కేయూ రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి, కెమిస్ట్రీ విభాగం రిటైర్డ్ ఆచార్యులు గాదె దయాకర్, కెమిస్ట్రీ విభాగం రిటైర్డ్ ఆచార్యులు వడ్డె రవీందర్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో ప్రస్తుత ప్రొఫెసర్ యాదగిరి రావు, రిటైర్డ్ ఆచార్యులు బన్న అయిలయ్య, మహేందర్‌రెడ్డి ఉన్నట్లు తెలుస్తోంది. ఆశావహులు తాము ఎలాగైనా వీసీ కావాలనే ఉద్దేశంతో రాజకీయ సంబంధాలను సైతం ఉపయోగించుకుంటున్నట్లు సమాచారం.

ఇన్‌చార్జ్ పాలన తప్పదా..?

కేయూ వీసీ రమేశ్ పదవీకాలం ఈనెల 21న ముగిశాక.. 22వ తేదీ నుంచి ఇన్‌చార్జ్ వీసీ పాలన తప్పదని తెలుస్తోంది. రాష్ట్రస్థాయిలో వివిధ ముఖ్యమైన హోదాల్లో పనిచేస్తున్న ఐఏఎస్‌ను ఇన్‌చార్జ్ వీసీగా నియమిస్తారని భావిస్తున్నారు. కేయూకు పూర్తిస్థాయి పాలకమండలి సభ్యులను నియమించాక వీసీ నియామకానికి సెర్చ్‌కమిటీకోసం యూనివర్సిటీ నామినీని నియమించాల్సి ఉంటుంది. సెర్చ్‌కమిటీ ఏర్పాటు.. వీసీ నియామకం పూర్తయ్యేవరకు మరో రెండు నెలలు సమయం పట్టొచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఎమ్మెల్సీ ఎన్నికలో బీజేపీదే విజయం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

- కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

హన్మకొండ/దేశాయిపేట: నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికలో బీజేపీదే విజయమని కామారెడ్డి ఎమ్మెల్యే, ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జ్ కాటిపెల్లి వెంకటరమణారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం హనుమకొండ హంటర్ రోడ్డులోని బీజేపీ పార్లమెంట్ ఎన్నికల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెంకటరమణారెడ్డి మాట్లాడారు. పట్టభద్రులు తమ బంగారు భవిష్యత్ కోసం నిర్ణయం తీసుకోవాల్సిన సమయం వచ్చిందన్నారు. నిరుద్యోగులు, ఉద్యోగుల కోసం బీజేపీ పోరాటం చేస్తుందని తెలిపారు. విద్యావంతులు తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. 2028లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని అభిప్రాయపడ్డారు. దీనికి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక నాంది పలుకాలని పేర్కొన్నారు. పట్టభద్రులు బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చినట్టే పదేళ్లలో కేంద్రం ఉద్యోగావకాశాలు కల్పించిందన్నారు. ప్రస్తుత రాజకీయాల్లో మార్పు రావాలన్నారు. ఇదిలాఉండగా.. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన తర్వాత మొదటిసారి హనుమకొండకు వచ్చిన ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డిని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, పార్టీ నాయకులు సన్మానించారు. సమావేశంలో వరంగల్ పార్లమెంట్ ప్రభారీ మురళీధర్ గౌడ్, వరంగల్, ములుగు జిల్లాల అధ్యక్షులు గంట రవికుమార్, బలరాం, మాజీ ఎంపీ సీతారాం నాయక్, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, నాయకులు ఎడ్ల అశోక్ రెడ్డి, ప్రదీప్ రావు, సరోత్తంరెడ్డి, విజయ్‌చందర్ రెడ్డి, సంతోష్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, జయపాల్ రెడ్డి పాల్గొన్నారు. అంతకు ముందు దేశాయిపేట రోడ్డులోని వరంగల్ తూర్పు బీజేపీ కార్యాలయంలో జరిగిన ఎమ్మెల్సీ ఉప ఎన్నికల సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణరెడ్డి మాట్లాడారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు 23న కౌన్సెలింగ్

ఏటూరునాగారం: జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్ రీజియన్‌లలోని గిరిజన గురుకుల కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఈ నెల 23న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు రీజనల్ కోఆర్డినేటర్ రాజ్యలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలిరోజున ఏటూరునాగారం స్పోర్ట్స్ కళాశాలలో బాలురులకు, ఈనెల 25న బాలికలకు ఏటూరునాగారం మండల కేంద్రంలోని బాలికల కళాశాలలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. కాటారం కళాశాల ఎంపీసీ, బైపీసీ, ఏటూరునాగారం ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ, ఏటీ, ములుగు ఎంపీసీ, బైపీసీ, దామరవంచ ఎంపీసీ, బైపీసీ, మహబూబాబాద్ ఎంపీసీ, బైపీసీ, మరిపెడ ఎంపీసీ, బైపీసీ, రెండ్యాల సీఈసీ, హెచ్‌ఈసీల్లో బాలురకు అవకాశం ఉందని తెలిపారు. అలాగే బాలికలకు కాటారం కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, పీటీ, ఏటూరునాగారం ఎంపీసీ, బై పీసీ, సీఈసీ, ఏటీ, ఐఎం, వెంకటాపురం(కె) ఎంపీసీ, బైపీసీ, కొత్తగూడ ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, కేసముద్రం సీఈసీ, హెచ్‌ఈసీ, మహబూబాబాద్ ఎంపీసీ, బైపీసీ కోర్సులకు అవకాశం ఉందని తెలిపా రు. ప్రతి గ్రూపులో ఎస్టీ విద్యార్థులతోపాటు ఎస్సీ, బీసీ, ఓసీలకు ఒక్కో సీటు ఉంటుందని, ఆర్ఫన్(అ నాథ)లకు, స్పోర్ట్స్ కోట కింద, దివ్యాంగులకు ఒ క్కో సీటు ఉంటుందని తెలిపారు. అర్హులైన విద్యార్థులు టెన్త్ మెమో, టీసీ, స్టడీ, కులం, ఆదాయం, ని వాసం సర్టిఫికెట్స్ (ఒరిజినల్స్)తోపాటు నాలుగు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఆధార్‌కార్డు రెండు సె ట్స్ జిరాక్స్‌లతో కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని సూచించారు.

హత్యకేసులో ఇద్దరి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రవీందర్

ఎస్ఎస్‌తాడ్వాయి: అంగన్‌వాడీ టీచర్ సుజాత హత్య కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ రవీందర్ తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పస్రా సీఐ శంకర్‌తో కలిసి ఆయన వివరాలు వెల్లడించారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని కాటాపూర్‌లో అంగన్‌వాడీ టీచర్‌గా పని చేస్తున్న ఏటూరునాగారం మండలం చిన్న బోయినపల్లి గ్రామానికి చెందిన సుజాత ఈనెల 14న విధులు ముగించుకుని ఇంటికి బయల్దేరింది. ఈక్రమంలో ఆర్టీసీ బస్సు వెళ్లిపోవడంతో ఏటూరునాగారం మండలంలోని రొయ్యూరు గ్రామానికి చెందిన ఆకుదారి రామయ్య బైక్‌పై కాటాపూర్‌లోని బస్టాండ్ వద్ద లిఫ్ట్ అడిగి ఎక్కింది. అంతకు ముందుగానే రామయ్య వెంట వచ్చిన రోయూరు గ్రామానికి చెందిన పగిడి జంపయ్యతో కలిసి ఆమెను అడవిలోకి తీసుకెళ్లి హత్యాచారం చేసి, ఆమె మెడలోని బంగారు గొలుసు లాక్కునే ప్రయత్నం చేయగా మృతురాలు ప్రతిఘటించడంతో తలపై బండారాయితో కొట్టి, గొంతు నొక్కి, స్కార్ఫ్‌తో మెడకు ఉరిబిగించి హత్య చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని సాంకేతిక పరిజ్ఞానంతో దర్యాప్తు చేపట్టారు. ఈనేపథ్యంలో పస్రా సీఐ శంకర్, తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి సిబ్బందితో కలిసి శుక్రవారం కాటాపూర్ క్రాస్ రోడ్డు వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా బైక్‌పై వెళ్తున్న రామయ్య, జంపయ్యను పట్టుకుని విచారించగా హత్య చేసినట్లు ఒప్పుకున్నారు. నిందితులు ఉపయోగించిన బైక్, బంగారు గొలుసు, పుస్తెలు, హ్యాండ్ బ్యాగ్, బ్యాంక్ పాస్ పుస్తకం, ఆధార్ కార్డు స్వాధీనం చేసుకుని, నిందితులను రిమాండ్ చేసినట్లు తెలిపారు. హత్య కేసును త్వరగా ఛేదించిన పస్రా సీఐ శంకర్, తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి, ఏఎస్సై నారాయణ, హెడ్ కానిస్టేబుల్ అనుమాండ్ల కిషన్, కానిస్టేబుళ్లు పూజారి రమేశ్, జాజ సాంబయ్య, అప్పాల రమేశ్, రాజీవ్, రాజేశ్‌లను డీఎస్పీ అభినందించారు. సమావేశంలో ఎస్సై శ్రీకాంత్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

రిజర్వేషన్ హామీ నెరవేర్చకుంటే ఉద్యమిస్తాం..

హన్మకొండ: ముదిరాజ్‌లకు ఇచ్చిన మాట ప్రకారం ఈ స్థానిక ఎన్నికలలోపే రిజర్వేషన్ హామీని నిలబెట్టుకోవాలని, లేకుంటే ఐక్య ఉద్యమాలు చేస్తామని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ – తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి బొట్లపల్లి సంజీవన్ కుమార్ ముదిరాజ్, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ బోయిని జగన్‌మోహన్ ముదిరాజ్ అన్నారు. హనుమకొండలోని అసోసియేషన్ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. బీసీ కుల గణనను ఈ స్థానిక ఎన్నికలలోపే చేయాలని, అప్పుడే బీసీలలో అధిక శాతం జనాభా ఉన్న ముదిరాజ్‌లకు లబ్ధి చేకూరే అవకాశం ఉందన్నారు. ముదిరాజ్‌లను బీసీ డి నుంచి బీసీ ఏ లోకి మార్చుకునే వెసులుబాటు రాష్ట్ర ప్రభుత్వానికే సుప్రీంకోర్టు ఇచ్చిందని, అందుకు అనుగుణంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శులు నీరటి రాజు, సింగారపు రామకృష్ణ, దండు చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

కేయూ లా కళాశాల ప్రిన్సిపాల్ రాజీనామా

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ లా కళాశాల ప్రిన్సిపాల్‌గా, బోర్డు ఆఫ్‌స్టడీస్ చైర్మన్‌గా, లా డీన్‌గా, యూనివర్సిటీలో లీగల్ సెల్ అండ్ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలను నిర్వర్తిస్తున్న ప్రొఫెసర్ ఎం.శ్రీనివాస్ తన పదవులకు రాజీనామా చేశారు. యూనివర్సిటీ లా కళాశాల ప్రిన్సిపాల్, బోర్డు ఆఫ్‌స్టడీస్ చైర్మన్ పదవులకు రాజీనామా చేస్తూ మూడు రోజుల క్రితం కేయూ రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డికి రాజీనామా లేఖను అందించారు. హనుమకొండలోని యూనివర్సిటీ లా కాలేజీలో ప్రస్తుతం ప్రొఫెసర్ శ్రీనివాస్‌తోపాటు అసోసియేట్ ప్రొఫెసర్ పద్మజారాణి, అసిస్టెంట్ ప్రొఫెసర్ సుదర్శన్ ఉన్నారు. ఒక్క శ్రీనివాస్‌కే నాలుగు కీలకమైన పదవులతో కూడిన బాధ్యతలు ఉండటంతో తనకు పనిభారం పెరిగి ఇబ్బందులు పడాల్సి వస్తుందని, వ్యక్తిగతంగా సమస్యలున్నాయని తెలిపారు. రెండు పదవులను మిగితా ఇద్దరు అధ్యాపకులకు కేటాయించాలని వీసీ రమేశ్‌ను కోరారు. అయినా శ్రీనివాస్‌నే కొనసాగిస్తుండటంతో తాను యూనివర్సిటీ లా డీన్, యూనివర్సిటీ లీగల సెల్ ఇన్‌చార్జ్‌గా మాత్రమే కొనసాగుతానని తెలిపారు. అయితే ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం గమనార్హం.

రాయపూర్ ఎక్స్‌ప్రెస్‌లో స్పెషల్ డ్రైవ్

- చైల్డ్‌లైన్‌కు బాలల అప్పగింత


బాలలను చైల్డ్‌లైన్‌కు అప్పగిస్తున్న సీఐ సంజీవరావు

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీసులు శుక్రవారం రాయపూర్ నుంచి సికింద్రాబాద్ (12772) వెళ్లే ఎక్స్‌ప్రెస్‌లో స్పెషల్ డ్రైవ్‌ను చేపట్టారు. కాజీపేట ఆర్పీఎఫ్ సీఐ ఎం.సంజీవరావు తెలిపిన వివరాల ప్రకారం.. రాయపూర్ ఎక్స్‌ప్రెస్‌లో బల్లార్షా నుంచి కాజీపేట వరకు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో అనుమానాస్పదంగా కనిపించిన 14ఏళ్ల బాలలను తరలిస్తున్న నలుగురు ట్రాఫికర్స్‌ను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని విచారించగా పిల్లలను హైదరాబాద్‌లో పని నిమిత్తం తీసుకెళ్తున్నట్లు తేలిందని తెలిపారు. 1098 చైల్డ్ లైన్ బాధ్యులను పిలిపించి ఆరుగురు బాలలను అప్పగించి, బాలలను తరలిస్తున్న నలుగురు వ్యక్తులను జీఆర్పీ పోలీసులకు అప్పగించినట్లు సీఐ వెల్లడించారు. ఇలాంటి చర్యలకు పాల్పడినవారికి చట్టప్రకారం శిక్ష తప్పదని హెచ్చరించారు.

బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకటగోపినాథ్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఆన్‌లైన్ ఎడ్యూకేషన్ (ఎస్‌డీఎల్‌సీఈ) సైన్స్ కోర్సుల డైరెక్టర్‌గా మైక్రోబయాలజీ విభాగం కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వెంకటగోపినాథ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఆబాధ్యతలు నిర్వర్తించిన బాటనీ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ కరుణాకర్ నుంచి బాధ్యతలను స్వీకరించారు. ఈసందర్భంగా ఎస్‌డీఎల్‌సీఈ డైరెక్టర్ ఆచార్య రాంచంద్రం, రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి, డాక్టర్ వల్లాల జగన్, కుక్టా అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్ కుమార్‌లోథ్, కాంట్రాక్టు అధ్యాపకులు సంకినేని వెంకట్, సూర్యం, శ్రీధర్, విద్యాసాగర్, సత్యనారాయణ, గడ్డం కృష్ణ, రాజునాయక్, తదితరులు అభినందించారు. ఆల్‌మాల స్టూడెంట్స్ అసోసియేషన్ కేయూ మాజీ అధ్యక్షుడు డాక్టర్ వెంకటేశ్వర్లు, దూరవిద్యాకేంద్రం ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎఫ్రీమ్‌రాజు బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు.

దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురి అరెస్టు

- 4 ద్విచక్ర వాహనాలు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

శాయంపేట: జల్సాల కోసం ద్విచక్ర వాహనాలు దొంగతనం చేస్తూ పట్టుబడ్డ నలుగురిని అరెస్టు చేసి, ద్విచక్ర వాహనాలును స్వాధీనం చేసుకున్నట్లు అదుపులోకి తీసుకున్నట్లు పరకాల ఏసీపీ కిశోర్‌కుమార్ తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం.. మండలంలోని వసంతాపూర్ గ్రామానికి చెందిన ముక్కెర సాయిచరణ్ హైదరాబాద్‌లోని బోడుప్పల్‌లో నివసిస్తున్నాడు. అక్కడ భూక్య అజాద్‌తో పరిచయం పెంచుకున్నాడు. ఇద్దరు కలిసి సినిమాలు, షికార్లకు వెళ్తూ జల్సాలు చేస్తూ విలాసవంతమైన జీవితానికి అలవాటు పడ్డారు. జల్సాలకు డబ్బులు లేకపోవడంతో ఆయా ప్రాంతాల్లో ఇళ్ల ఎదుట ఉన్న ద్విచక్ర వాహనాలను దొంగిలించి హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలోని వసంతాపూర్ గ్రామంలో ఉన్న అవినాష్, హరికృష్ణకు అప్పగించి వారితో వాహనాలు అమ్మించి డబ్బులను వాడుకునేవారు. బోడుప్పల్ ప్రాంతం నుంచి స్కూటీ, హోండా షైన్, పల్సర్ బైక్‌లను చోరీ చేయగా శాయంపేటలో ఒక స్కూటీని దొంగతనం చేసి అప్పగించినట్లు తెలిపారు. నెలలో నాలుగు బైకులు చోరీ చేసినట్లు తెలిపారు. ద్విచక్ర వాహనాల దొంగల ముఠాను ఎస్సై ప్రమోద్‌కుమార్, పోలీస్ కానిస్టేబుల్ సాధన్, ఖలీల్, హెచ్‌జీ నరేష్ చాకచక్యంగా పట్టుకున్నారు. బోడుప్పల్‌కు చెందిన ముక్కెర జాన్ విల్సన్ అలియాస్ సాయిచరణ్ అలియాస్ లడ్డు, భూక్య ఆజాద్ అలియాస్ అజ్జి, వసంతాపూర్‌కు చెందిన ముక్కెర అవినాష్, మేకల హరికృష్ణలను శుక్రవారం అరెస్టు చేసి నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరు పరిచినట్లు కిశోర్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో శాయంపేట సీఐ రంజిత్‌రావు, ఎస్సై ప్రమోద్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

రంగస్థలనాటక కార్యక్రమాలకు అనుగుణంగా కళాక్షేత్రం


ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సదానందం

హన్మకొండ కల్చరల్ : ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న కాళోజీ కళాక్షేత్రాన్ని రంగస్థలనాటక కార్యక్రమాలకు అనుగుణంగా నిర్మించాలని తెలంగాణ రాష్ట్ర నాటక సమాజాల సమాఖ్య అధ్యక్షుడు ఆకుల సదానందం కోరారు. ఈ మేరకు శుక్రవారం హనుమకొండ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని కోరారు. ఈసందర్భంగా రంగస్థల నాటక కార్యక్రమాలకు వేదికగా ఉండేందుకు కర్టెన్స్, లైటింగ్, సౌండ్ సిస్టిమ్స్, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. ఎమ్మెల్యే స్పందిస్తూ తన వంతు సహకారం అందిస్తానని అన్నారు. కార్యక్రమంలో వరంగల్ కాకతీయ నాటక కళాపరిషత్ అధ్యక్షుడు రాధారపు సంజీవరెడ్డి, జిల్లా రంగస్థల నాటక కళాకారుల ఐక్యవేదిక అధ్యక్షుడు కాజీపేట తిరుమలయ్య, ఓడపల్లి చక్రపాణి, గూడూరు బాలాజీ, జూలూరు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ ఇండస్ట్రీలో చోరీ

రామన్నపేట : వరంగల్ నగరంలోని ఎస్‌వీఎస్ రోడ్డులోని ఇండస్ట్రీయల్ ఏరియాలో గోపి ప్లాస్టిక్ ఇండస్ట్రీలో చోరీ జరిగినట్లు మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపి శుక్రవారం తెలిపారు. బాధితుడు గునిశెట్టి రాజేశ్వర్‌రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇండస్ట్రీయల్ ఏరియాలో గత పది సంవత్సరాల నుంచి గోపి ప్లాస్టిక్ ఇండస్ట్రీస్ పేరుతో ప్లాస్టిక్ బాటిళ్లు, క్యాన్స్ ప్రొడక్షన్, లంబాడ గాజులు వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 7వ తేదీన ఉదయం 5.30గంటలకు షాప్ పక్కన ఉన్న రెడీమేడ్ డ్రెస్ తయారీ ఇండస్ట్రీ యజమాని శ్రీనివాస్ మీ షటర్‌లో శబ్దం వస్తుందని ఫోన్ చేయగా వెళ్లిచూసినట్లు తెలిపారు. ఈ క్రమంలో ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు షాప్ వెనకాల కిటికీ పగులగొట్టి షాప్‌లోకి చొరబడినట్లు గుర్తించారు. షాప్‌లోకి వెళ్లి పరిశీలించగా.. సుమారు 1.30లక్షల విలువ గల పలు మౌల్డ్‌లు, మౌల్డింగ్ మిషన్ మోటర్, కంప్రెషన్ మోటర్ అపహరణకు గురయ్యాయని గుర్తించినట్లు తెలిపారు. గునిశెట్టి రాజేశ్వర్ రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ గోపి తెలిపారు.

పోద్దాడుకు ముంజలు!



జనగామ రూరల్: ఎక్కడ ఏ వింత జరిగినా.. అచ్చం వీరబ్రహ్మేంద్ర స్వామి చెప్పినట్టే జరుగుతుందని ప్రజలు అనుకుంటారు. అలాంటి ఘటనే జనగామ మండలంలోని వడ్లకొండలో వెలుగుచూసింది. గ్రామంలో పోద్దాడు చెట్టుకు ముంజలు కాస్తున్నాయి. ఈవిషయం స్వయంగా ఆ చెట్టునుంచి రోజూ కల్లు తీస్తున్న సట్ల ఉప్పలయ్య, సందీప్ చెబుతున్నారు. గతంలో ఎన్నడు, ఎక్కడా జరగలేదని ప్రస్తుతం ఈ చెట్టుకు ముంజలు కాయడం వింతగా ఉందని ఆశ్చర్యం వ్యక్తం చేశారు.